క్లుప్తంగా

రోగులకు పండ్ల పంపిణీ



కొడిపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న గంగయ్య

కొడిపల్లి(నర్సాపూర్): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం మండల కేంద్రం కొడిపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ కుమ్మర సంఘం ప్రచార కార్యదర్శి కుమ్మరి గంగయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం సభ్యులు శ్రీనివాస్, భిక్షపతి, నాగరాజు, మోహన్, గట్టయ్య, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు ధ్వంసం



గుంతలమయంగా మారిన బీటీ రోడ్డు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి నుంచి ఎల్కపల్లి మీదుగా యశ్వంతరావ్‌పేట వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు మొత్తం ధ్వంసమైంది. బీటీ ధ్వంసమై కంకర తేలడంతో గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనబడక వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి బీటీ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన బెల్టులతో విద్యార్థులు

పెద్దశంకరంపేట(మెదక్): మార్షల్‌ఆర్ట్స్‌లో మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. శుక్రవారం జిల్లా కేంద్రం మెదక్‌లోని గుల్షన్ క్లబ్‌లో నిర్వహించిన రెంజీకీ సుడోకాన్ కరాటే బెల్ట్‌టెస్ట్ పోటీల్లో జూకల్ గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా మధుప్రియ, సంతోష్‌లకు గ్రీన్, చరన్ ఆరెంజ్, మల్లేశంలకు బ్రౌన్ బెల్ట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్‌లు నగేశ్, విద్యాసాగర్, దినకర్, జూకల్ కరాటే మాస్టర్ పరశురాం పాల్గొని విద్యార్థులను అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించి గ్లాసుల్లో నీరు పోస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: వాకిటి లక్ష్మారెడ్డి స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి తన పుట్టిన రోజును పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలో చలి వేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతీ ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

నగదు పట్టివేత



కాళ్లకల్ వద్ద పట్టుకున్న నగదుకు రశీదును అందజేస్తున్న ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): సరైనా పత్రాలు లేకుండా నగదుతో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద నుండి రూ 95 వేల నగదుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తూప్రాన్ మండలం రావెల్లికి చెందిన బూర్గుల జయరాంరెడ్డి కొంపల్లి నుంచి ఊరికి డబ్బుతో ప్రయాణిస్తుండగా కాళ్లకల్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. దీంతో పోలీసులకు లభించిన డబ్బుకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి సిద్దిపేట్ ఎన్నికల అధికారి కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

జిల్లా వ్యాప్తంగా భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీలకు, సంఘాలకు అతీతంగా నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. భారత దేశ ఉప ప్రధానమంత్రిగా బాబు జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచిస్తే, రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు జగ్జీవన్‌రామ్ అనేక కృషి చేశారన్నారు.



నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు



రామాయంపేటలో ..



నర్సాపూర్‌లో..



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో ..



నిజాంపేటలో..



చేగుంటలో..



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్ వద్ద ..



పెద్దశంకరంపేటలో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో ..



టేక్మాల్‌లో..



మెదక్‌జోన్: టీఎన్‌జీవో భవన్‌లో..



మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో..



తూప్రాన్: యావాపూర్‌లో ..

ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు



చాకరిమెట్ల ఆలయం వద్ద కేక్ కటింగ్ అనంతరం ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చాకరిమెట్ల ఆంజనేయస్వామిని ఎమ్మెల్యే దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆమెను ఆశీర్వదించారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, సీనియర్ నాయకులు చంద్రాగౌడ్, మహిపాల్‌రెడ్డి, యాదగౌడ్, హనుమంతరెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, కుంట లక్ష్మణ్, లక్ష్మణ్‌గౌడ్, భిక్షపతిరెడ్డి, సురేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి, మాసాయిపేటలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాసాయిపేట మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజు, మాజీ ఎంపీటీసీలు సిద్ధిరాములుగౌడ్, అశోక్‌గౌడ్, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణాగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రఘునందన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

రామాయంపేట(మెదక్): మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ ఆపార్టీ కార్యకర్తలు శుక్రవారం రామాయంపేటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ మళ్లీ మోదీ ప్రధాని కావాలంటే బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వ్యాపార సముదాయాల్లో కూడా ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు శంకర్‌గౌడ్, శ్రీరాం ముత్తయ్య, భానుచందర్ పాల్గొన్నారు.



రామాయంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు

అంగరంగా వైభవంగా ఎల్లమ్మ కల్యాణోత్సవం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో శుక్రవారం ఎల్లమ్మ జమదగ్ని ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ సమేత జమదగ్ని కల్యాణోత్సావాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు లక్ష్మణశాస్త్రి, వెల్దుర్తి బాలారాజాగౌడ్, బజారు కొండాగౌడ్ దంపతులు, వినోయ్, వెంకట్ గౌడ్, నాగేశ్‌గౌడ్, జయరామ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టివేత



పట్టుబడ్డ బియ్యం లారీ

రామాయంపేట(మెదక్): అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రంజిత్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన వ్యక్తి మరొకరి సహకారంతో రామాయంపేటతో పాటు పరిసర ప్రాంతాల్లో బియ్యాన్ని సేకరించి కోళ్ల ఫారాలకు అక్రమంగా సరఫరా చేస్తున్నారు. తమకు అందిన సమాచారం మేరకు బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకొని 16 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనపర్చుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా బియ్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బీజేపీ ప్రచార రథం ప్రారంభం



టేక్మాల్‌లో ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని చౌరస్తాలోని పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం పూజలు నిర్వహించి ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మోదీ హయంలోనే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుమ్మరి సిద్ధిరాములు, అబ్బని రాములు, మహిళా నాయకురాలు పట్లోళ్ల మల్లిక, పార్టీ మండల ఉపాధ్యక్షులు వడ్డె రాములు, మాజీ మండలాధ్యక్షుడు ఎల్లుపేట రాజు, యువమోర్చా అధ్యక్షుడు పవన్, ఎస్టీ మోర్చా మండలాధ్యక్షులు సేనాపతి, మల్లిక, జిల్లా కార్యదర్శి శామయ్య, బీసీ మోర్చా అధ్యక్షులు శేఖర్, రవి నాయక్, రమేశ్, వెంకట్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





నీరు పడకపోవడంతో మూసివేసిన బోరుబావులు

'బోరు' మన్న రైతన్న

కొల్చారం(నర్సాపూర్): ఇక్కడ కనిపిస్తున్న రెండు దృశ్యాలు మండలంలోని మెదక్ – జోగిపేట ప్రధాన రహదారి పక్కన రంగంపేట గ్రామ శివారులోనివి. బోరు కింద వరి పంట సాగు చేసిన రైతుకు ఉన్న బోరు వట్టిపోవడంతో పంటను కాపాడుకునేందుకు ఒక బోర్ వేసిన అది కూడా ఫెయిల్ కావడంతో, మరో బోరు వేస్తే నిరాశే మిగిలింది. ప్రస్తుతం పంట పూర్తిగా ఎండు ముఖం పట్టింది. దీంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

గ్రామాల్లో కానరాని పల్లెవెలుగు

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గ్రామాల్లో బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిలప్‌చెడ్ మండల కేంద్రంగా ఏర్పడి ఏడేళ్లు అయినా.. మౌలిక సదుపాయాలు లేవు. ఉమ్మడి కొడిపల్లి మండలంగా ఉన్నప్పుడు గ్రామాల్లో ఉన్న ఆర్టీసీ బస్సు సౌకర్యం ప్రస్తుతం లేదు. కరోనా వైరస్ వ్యాపించక ముందు కొడిపల్లికి, గౌతాపూర్, ఫైజాబాద్, బండపోతుగల్, అజ్జమర్రి, గంగారం గ్రామాల మీదుగా బస్సు సౌకర్యం ఉండేది. కాలక్రమేణా ఆ గ్రామాలకు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు పడ్డారు. పలువురు నాయకులు సంగారెడ్డి డిపో మేనేజర్‌ను సంప్రదించి, వినతిపత్రాలు అందజేయడంతో కేవలం విద్యార్థుల కోసం గౌతాపూర్, ఫైజాబాద్, బండపోతుగల్ గ్రామాల మీదుగా వెళ్లేందుకు ఒక బస్సు సౌకర్యం కల్పించారు. నర్సాపూర్ బస్ డిపో ఏర్పాటయ్యాక శీలాంపల్లి గేటు నుంచి సోమక్కపేట్, అంతారం, మీదుగా నర్సాపూర్‌కు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చొరవతో ఒక బస్ సౌకర్యం కల్పించారు. ఆ గ్రామాల మీదుగా వెళ్లే బస్‌ను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నాయకులు ఘనంగా ప్రారంభించారు. కాగా ఈ ప్రారంభం మూడు రోజుల ముచ్చటగానే ఉంది. కేవలం పది రోజులు కూడా సక్రమంగా నడవకుండానే ఆ సర్వీస్‌ను నిలిపివేశారు. ఫైజాబాద్, అజ్జమర్రి రూట్లో వెళ్లే బస్సు, పాఠశాలలు ముగిశాక ఆ బస్సు సౌకర్యం నిలిపివేయకుండా అలాగే ఉంచాలని ఆయా గ్రామస్తులు కోరారు. అదేవిధంగా ఆ గ్రామాల్లో రూట్లో నుంచి సికింద్రాబాద్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని, నర్సాపూర్ డిపో సూపరింటెండెంట్‌కు పలువురు నాయకులు వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



సోమక్కపేట్‌లో బస్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నాయకులు (ఫైల్)

బస్సు సౌకర్యం కల్పించండి



గతంలో బస్సు సౌకర్యం ఉండేది. ప్రస్తుతం మంచి రోడ్డు ఉన్న బస్సు సౌకర్యం లేదు. శీలాంపల్లి నుంచి ఎక్కడికైన వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా విద్యార్థులు సమయానికి పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.

– రాజేందర్‌రెడ్డి, శీలాంపల్లి

మరో బస్సు ఏర్పాటు చేయాలి



అజ్జమర్రి గ్రామానికి వచ్చే బస్సు కేవలం విద్యార్థుల కోసమే వస్తుంది. పాఠశాలల ముగిశాక ఆ సర్వీస్‌ను నిలిపివేస్తారు. అలా కాకుండా ఆ రూట్లో ఉండే నాలుగు గ్రామాల ప్రజల సౌకర్యం కోసం మరో బస్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలి. పైగా నైట్ ఆల్ట్ అజ్జమర్రి గ్రామంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– సురేందర్‌రెడ్డి, అజ్జమర్రి

దాబాల వద్ద ఆర్టీసీ బస్సులు



తూప్రాన్ బైపాస్ మార్గంలో దాబాల ఎదుట నిలిపిన ఆర్టీసీ బస్సులు

ఇబ్బందుల్లో ప్రయాణికులు

తూప్రాన్: ఆర్టీసీ డ్రైవర్లు దాబా హోటళ్ల యాజమానులు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రయాణికులను సకాలంలో గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చాల్సిన వారు రహదారుల పక్కన ఏర్పాటు చేసుకున్న దాబా హోటళ్ల వద్ద రాత్రి, ఉదయం వేళల్లో గంటల గంటలుగా నిలిపి వేస్తున్నారు. దీంతో అత్యవసరంగా సుదూర ప్రాంతాలకు వేళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాబా హోటళ్ల వద్ద బస్సులు నిలిపితే డ్రైవర్, కండక్టర్‌కు ఏది తిన్న ఉచితంగా దాబా యాజమాని అందజేస్తారు. ప్రతీ పండుగకు కానుకలు ఇస్తారు. ఇదిలా ఉంటే ఆర్టీసీ బస్టాండ్‌లో క్యాంటీన్‌లు ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ వారు బస్సులు నిలుపరు. ఇదిలా ఉంటే తూప్రాన్ మీదుగా హైదరాబాద్‌కు – నిజామాబాద్ వైపునకు వందల సంఖ్యలో బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే తూప్రాన్ పట్టణం గుండా రావాల్సిన బస్సులు బైపాస్ మార్గంలో వెళ్తున్నాయి. దాబాల వద్ద ఆపొచ్చు నన్నా భావనతో బస్సు డ్రైవర్లు వ్యవహరిస్తున్నారు. రాత్రి వేళ తూప్రాన్‌లో బస్సులకు స్టాప్ లేదని ప్రయాణికులకు తెగేసీ చెబుతున్నారు. దీంతో బిక్కుబిక్కుమంటూ వేరే బస్సులు వచ్చేంత వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. బస్టాండ్‌లో క్యాంటీన్ నిర్వహణకు రూ.లక్షలు వెచ్చించి టెండర్లు దక్కించుకున్నవారురికి గిరాకీ లేక వేళవేళబోతుంది. కొన్ని నెలలకే వాటిని తొలగిస్తున్నారు. ఇప్పటికైన రాష్ట్ర ఆర్టీసీ అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించి, ఆర్టీసీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటే ప్రభుత్వ ఖాజానకు మేలు జరుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.